# అల్లరి

ALLARI



## చెప్పుకోండి



- కడుపులో పిల్లలు. కంఠంలో నిప్పులు. అరుపేమో ఉరుము. ఎరుపంటే భయము? **- రైలు**
- చీకటి ఇంట్లో జడల దయ్యం? **- ఉట్టి**
- పొంచిన దయ్యం! ఉన్నచోట ప్రత్యక్షం! **- నీడ**

## పద్యం - భావం

**ఎప్పటికెయ్యది ప్రస్తుత**
**మప్పటికా మాటలాడి యన్యుల మనముల్**
**నొప్పింపక తానొవ్వక**
**తప్పించుక తిరుగువాడు ధన్యుడు సుమతీ!**

**భావం :** విజ్ఞతను ప్రదర్శించి.. ఏ సందర్భంలో ఎలా మాట్లాడితే నలుగురూ ప్రశంసిస్తారో, ఆ సందర్భంలో అలానే మాట్లాడాలి. ఎప్పుడూ ఇతరుల మనసుకు కష్టం కలిగేలా మాట్లాడకూడదు. మన మాటల వల్ల ఎదుటివ్యక్తి మనసుకు గాయం కాకుండా ఉండాలి. అప్పుడే, మాటతీరులో మనం రాణించినట్టు.

## తమాషా ప్రశ్నలు

- వంక కాని వంక? **- నెలవంక**
- జాబు కాని జాబు? **- పంజాబు**
- కారు కాని కారు? **- పుకారు**

# ఎర్రి ఎంకన్న..

**ఒక ఊళ్లె ఓ** ఎర్రి బాగులాయినె ఉంటుండె. ఆయినె పేరు.. ఎంకన్న! అందరు 'ఎర్రి ఎంకన్న!' అని పిలిశెటోళ్లు. సూత్తె ఎర్రెర్రిగనే ఉంటుండె గని.. ఇక మతులకు తక్వ లేకుండె. ఒకపారి పక్కూరి సంతకు వోయి.. ఓ మేకను గొనుక్కరమ్మని ఎర్రి ఎంకన్నను పంపిచ్చింది ఆయినె పెండ్లాం. మనోడు ఉట్టిగ వోక.. మెడల బంగారు గొలుసు, శేతులకు ఎండి కడాలు, కాళ్లకు అంకి శెప్పులు తొడుక్కొని.. ఊపుకొంట వోయిండు. అడివిలకెల్లి వోంగ.. ఈని టాకుటీకు జూసిన ఓ దొంగోడు, ఈన్ని ఎట్లయిన బోర్లెయ్యాల్నని అనుకున్నడు. ఆడు మల్ల అచ్చేదాన్క ఆన్నే కూసున్నడు. మాపటీలికి మాంచి నిగనిగలాడె మ్యాకపిల్లతోని తిరుగుపయనమైండు ఎంకన్న. నట్టనడిమి అడివిలకు రాంగనే.. గా దొంగోడు శేతుల బల్లెం బట్టుకొని, ఎంకన్న ముంగటికి అచ్చిండు. బెదిరిచ్చి బంగారు గొలుసు, ఎండి కడాలు, శేతులన్న పైసలన్ని గుంజుకున్నడు. ఆకర్కు.. మ్యాకపిల్లను గూడ ఇయ్యిమని బెదిరిచ్చిండు. దాన్ని గూడ ఇచ్చిండు ఎంకన్న. మర్రిపోతున్న దొంగోన్ని విలిశి.. ''ఇగో దొంగన్న! నాతానున్న అన్ని గుంజుకున్నవు గదా! నీ శేతులున్న బల్లెం నాకు ఇయ్యరాదు! అట్టి శేతులతోని ఇంటికి వోతె.. నా పెండ్లం లొల్లివెడ్తది! అదన్న పట్కపోత!'' అంట బతిమ్లాడిండు. జేబుల నిండ బంగారం, ఎండి.. శెయ్యినిండ పైసలు దొరికెవరకు, ఎన్క ముంగట సోంచాయించకుంట ఆయింత బల్లెం ఎంకన్న శేతుల వెట్టిండు దొంగోడు. బల్లెం దొర్కంగనే.. పెండ్లాన్ని యాజ్జేసుకొని, దొంగోన్ని ఒక్క పోటు పొడిశిండు ఎంకన్న. దాంతోని అన్ని ఆన్నే వారేశి.. లంకెవెట్టిండు దొంగోడు.

... పత్తిపాక మోహన్



## మంచిమాట

విద్య అంటే మనలో
సమాచారం నింపేది కాదు.
మన జీవితాన్ని ఉత్తమంగా తీర్చిదిద్దేది!

## అమర్చండి



S E A P

☐☐☐☐

**బొమ్మ ఆధారంగా అక్షరాలను సరైన క్రమంలో అమర్చండి.**

## రంగులేయండి





**చుక్కల ఆధారంగా బొమ్మ గీసి, రంగులు వేయండి.**

## మీకు తెలుసా?

మన ఇళ్లలోని ముఖ్యమైన వస్తువుల్లో డైనింగ్ టేబుల్ ఒకటి. ఎవరి గదులు వారికి ప్రత్యేకంగా ఉన్నా.. కుటుంబ సభ్యులంతా కలిసి భోజనాలు చేసేది.. కబుర్లు చెప్పుకొనేది ఇక్కడే! అయితే, జపాన్‌లో మాత్రం.. డైనింగ్ టేబుల్ వాడకం లేదు. అక్కడ ఎంత సంపన్నులైనా.. ఎంత పెద్దవారైనా.. నేలమీద చాపలు పరుచుకొనే భోజనం చేస్తారు.

